

ప్రతిభ వెలికితీతకు పోటీలు దోహదం

● ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి

● ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు ప్రారంభం

7లో



ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

గొండూరు గుట్ట.. స్వాహా

● లోహరిబందలో ఆక్రమణల పర్వం ● 45 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

● రెండు చెరువులు కూడా.. ● చోద్యం చూస్తున్న అధికారులు



● మందస మండలం లోహరిబంద పంచాయతీ యశోదనగర్‌లో ఆక్రమిత స్థలంలో నిర్మించిన భారీ భవంతి ఇది. అనుమతులు లేకుండా ఇలాంటి పలు భవనాలు నిర్మించినా.. ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



● లోహరిబంద పంచాయతీలో గొండూరు గుట్టపై రేకుల షెడ్డుతో ఆక్రమించిన ప్రాంతమిది. రోడ్డుకు పక్కనే ఉండటంతో ఈ ప్రాంతానికి అధిక డిమాండ్ ఉంది. దీంతో గుట్టను ఆక్రమించి.. చదును చేసి.. ఇళ్ల స్థలాలుగా విక్రయించడం చర్చనీయాంశమవుతోంది.

హరిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.. అక్రమార్కులు కన్నేస్తున్నారు. కొండ, చెరువు, గుట్ట, కాలువ.. కాదేది ఆక్రమణకు అనర్హం అన్న చందంగా కబ్జాకు పాల్పడుతున్నారు. జిరాయితీ భూముల్లా సాగు చేస్తున్నారు. మందస మండలం లోహరిబంద పంచాయతీలో యశోదనగర్ వద్ద గొండూరు గుట్ట పేరుతో 50 ఎకరాల కంకర మెట్టను ఇదే తరహాలో చెరబడుతున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే సుమారు 45 ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఆక్రమిత స్థలంలో పశువుల పాకలు, షెడ్డులు, పేరిట చిన్నచిన్న గుడిసెలు నిర్మిస్తున్నారు. ఇక్కడ ఆరేళ్లుగా ఆక్రమణ పర్వం కొనసాగుతున్నా.. అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం.

మందస మండలం లోహరిబంద పంచాయితీ పరిధిలో గొండూరు గుట్ట పేరుతో సర్వే నెంబరు110లో 50 ఎకరాల కంకర మెట్ట విస్తరించి ఉంది. బీడు ప్రాంతంలో ముళ్లపొదలుతో నిండిన ఈ ప్రాంతాన్ని అప్పటి రెవెన్యూ అధికారులు గుర్తించగా.. 1993లో టీడీపీ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ తల్లి యశోదమ్మ పేరుతో ఇక్కడ 80 మంది పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. రహదారులు, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించింది. ఏడేళ్ల కిందట ఇక్కడ రహదారిని తారురోడ్డుగా మార్చడంతో అక్రమార్కులు కన్ను ఈ ప్రాంతంపై పడింది. ఒక్కొక్కరూ ఎకరా, రెండు ఎకరాల చొప్పున కబ్జాకు పాల్పడ్డారు. ఆక్రమిత స్థలంలో రేకుషెడ్డులు, గొర్రెలు పాకలు, పశు వుల శాలలు నిర్మించారు. మరికొందరు జీడి, అరటి, మునగ మొక్కలు నాటి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతానికి ఆనుకుని తోటలు ఉన్న స్థానికులే ఆక్ర మణకు పాల్పడటం గమనార్హం. దీనిపై గ్రామస్థాయి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. దీంతో 50 ఏకరాల్లో సుమారు 45ఎకరాలు పరాధీనమయ్యాయి.

ఎకరా రూ.50 లక్షల పైనే...

ఈ ప్రాంతంలో విద్యుత్‌తోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఇక్కడ ఎకరా విలువ ప్రస్తుతం రూ.50లక్షల పైమాటే. ఆ లెక్కన ఆక్రమణకు గురైన సుమారు 45ఎకరాల విలువ సుమారు రూ.23 కోట్ల వరకు ఉంటుందని అంచనా.. లోహరిబంద నుంచి యశోదనగర్ మీదుగా.. ఎల్ కొత్తూరు వరకు తారురోడ్డు నిర్మించారు. దీంతో ఈ ప్రాంతానికి భారీ డిమాండ్ నెలకొంది. ఇదే ప్రాంతంలో లోహరిబంద హైస్కూల్ ఆట స్థలానికి సుమారు రెండెకరాల స్థలం కేటాయించారు. ఆ స్థలంలోనే జగనన్న కాలనీకి పట్టాలు మంజూరు చేయగా... ఆట స్థలం కావడంతో కొన్ని ఇళ్లు పునాదులతో ఉండగా.. మరికొన్ని నిలిచిపోయాయి. ఈ ఆక్రమణలపై అధికారులు స్పందించి భూములు పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

చెరువులు కబ్జా...

ఈ గుట్టకు మరోవైపు దిగువ భాగంలో రెండు చిన్న చెరువులు ఉన్నాయి. వేసవిలో పశువులు, మూగజీవాలు దాహార్తి తీర్చుకోవడానికి వందేళ్లకు ముందే గ్రామస్థులు తవ్వించారు. దీంతో అక్రమార్కులు వాటిని కూడా విడిచిపెట్టకుండా కంచెలు కట్టి ఆక్రమించారు. జీడి, అరటి, మామిడి పంటలు సాగుచేస్తున్నారు. ఇళ్లకు ఆనుకొని సుమారు రెండెకరాల ఆట స్థలం (మిగతా 6వ పేజీలో..)

కొండలను కొల్లగొట్టి..!



రాజగోపాలపురంలో కంకర తవ్విన తరువాత.. ఆ స్థలాల్లో అక్రమార్కులు పండిస్తున్న వరిపంట

● కంకర కోసం ఇష్టారాజ్యంగా తవ్వకాలు

● ఆపై చదును చేసిన స్థలాల్లో.. సాగు

● పలాస మండలంలో ఆరు నెలలుగా అక్రమాలు

● పట్టించుకోని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు

పలాస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

పలాస మండలం జగన్నాథపురం, రాజగోపాలపురం, లొద్దభద్ర గ్రామాల సరిహద్దులో ఉన్న అటవీ, రెవెన్యూశాఖ ఆధీనంలో ఉన్న కొండల్లో కంకరను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. ఆపై చదునుగా ఉన్న భూమిని పంట పొలాలుగా మార్చి సాగు చేస్తున్నారు. గత ఆరు నెలలుగా ఈ వ్యవహారం జరుగుతున్నా సచివాలయ సిబ్బంది కానీ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కానీ దృష్టి సారించకపోవడం చర్చనీయాంశమవుతోంది. దీని వెనుక అదృశ్యశక్తి ఎవరో ఉన్నారనే ప్రచారం సాగుతోంది.

● అప్పట్లో ఒక పార్టీ నాయకులే ఈ తతంగాన్ని నడిపేవారు. ప్రస్తుతం ఇరు పార్టీల నాయకులు కలిసి కంకరను తవ్వుకుంటున్నారనే విమర్శలున్నాయి. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి చెందిన కొంత మంది వైసీపీ నాయకులు సొంత ఎక్స్‌కవేటర్లు, ట్రిప్పర్లతో కంకరను తరలిస్తున్నారు. రాత్రి 11 గంటలయితే చాలు కొండల్లో శబ్దాలతో ప్రజలు హడలిపోతున్నారు. రాజగోపాలపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ఒకరు ఈ వ్యవహారాన్ని ప్రజలతో వెళ్లి స్వయంగా పరిశీలించి అధికారులకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి తాము సెక్యూరిటీ లేకుండా ఏ విధంగా వెళ్లగలమని అధికారులు మౌనం దాల్చుతున్నారు.

● ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉన్న మొత్తం నాలుగు కొండలను (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గృహ నిర్మాణ బకాయిలపై దృష్టి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల బిల్లుల బకాయిల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మండలస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. 2014-19 మధ్య జిల్లావ్యాప్తంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సంబంధించి రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండడంపై అధికారులను నిలదీశారు. నిర్మాణంలో ఉన్న కాలనీల పరిస్థితి గురించి ఆరా తీశారు. ప్రజలకు సత్వర సేవలు అందించే విషయంలో అలసత్వానికి తావు లేదన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి వాహనాల నమోదు, రైతు సేవా కేంద్రాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆసుపత్రుల్లో మందుల పంపిణీ, డయాగ్నోస్టిక్ సేవలు పకడ్బందీగా చూడాలన్నారు. రాబీస్, పాము కాటు, వ్యాక్సిన్, యాంటీ వీనమ్ నిల్వలు సరిపడా ఉండాలని ఆదేశించారు. జి.సిగడాం, కవిటి, పొందూరులో సాంకేతిక సమస్యల కారణంగా పలు అంశాలు పెండింగ్‌లో (మిగతా 7వ పేజీలో..)

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

● పైడిభీమవరంలో ఎఫ్ఎఫ్‌సీ భవనం ప్రారంభం



పైడిభీమవరంలో ఎఫ్ఎఫ్‌సీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం/ జి.సిగడాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'యువత భవిష్యత్ కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. పరిశ్రమల స్థాపనతోపాటు స్వయం ఉపాధి పొందేలా యువతను ప్రోత్సహిస్తోంద'ని ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలోని 87 ప్రాంతాల్లో సుమారు రూ.20వేల కోట్లతో వివిధ పరిశ్రమలను ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం నుంచి సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా పైడిభీమవరంలోని పారిశ్రామిక వాడలో రూ.14.60 కోట్లతో ఏపీఐఐసీ ద్వారా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్ఎఫ్‌సీ) బహుళ యూనిట్ భవనాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి మంత్రి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలంతా స్థానికంగానే పని చేసుకోవటానికి వీలుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను నిర్మించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత తయారవ్వాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని, యువత ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

ఆవిష్కరణలను కొనియాడిన సీఎం చంద్రబాబు

ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు మొదటగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో వర్చువల్‌గా మాట్లాడారు. పైడిభీమవరం ఐడీఏలో లిక్విడ్ ఆక్సిజన్ పరిశ్రమను స్థాపించిన లిక్వినాక్స్ సంస్థ అధినేత రాజేశ్‌బాబు చేసిన సేవలను సీఎం కొనియాడారు. విద్యార్థులు సైతం వినూత్న ఆవిష్కరణల దిశగా ప్రయత్నించాలని సూచించారు. రాజేష్‌బాబు మాట్లాడుతూ.. '2016లో విశాఖ భాగస్వామ్య సదస్సులో ఒప్పందం కుదుర్చుకున్నాం. 2019లో ఉత్పత్తి ప్రారంభించాం. 2020లో కరోనా కష్టకాలంలో మా సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేసి లక్షలాది మంది రోగుల ప్రాణాలు కాపాడాం. రిమ్స్, జెమ్స్, కేజీహెచ్‌కు నిరంతరాయంగా సిలిండర్లు అందజేశామ'ని తెలిపారు. మరో పారిశ్రామికవేత్త విజయనగరానికి చెందిన పీవీఎస్ రామస్వామి మాట్లాడుతూ.. 'సంతవురిటిలో వరి, ఇతర పంటల వ్యర్థాల నుంచి బయోకంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ఉత్పత్తి చేసే పరిశ్రమను స్థాపిస్తున్నాం. సీఎం ఆలోచనా విధానాన్ని ప్రేరణగా తీసుకుని ఈ పరిశ్రమకు అంకురార్పణ చేశాం. విశాఖలోని సీఐఐ సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోనున్నామ'ని సీఎం చంద్రబాబుకు తెలియజేశారు.

సంతవురిటిలో బయోగ్యాస్ ప్లాంట్

జి.సిగడాం మండలం సంతవురిటిలో రూ. 100 కోట్లతో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్‌కు మంత్రి శ్రీనివాస్ మంళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పరిశ్రమలు- ఉపాధి కల్పన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఈ పరిశ్రమల ద్వారా 2 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు (మిగతా 7వ పేజీలో..)



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ వచ్చే నెల 13న నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, న్యాయవాదులు, అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ.. 'వచ్చే నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రజలకు న్యాయం చేసేలా.. ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు ప్రయత్నించాలి. రాజీ చేయడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కావు' అని తెలిపారు. గతంలో ఎక్కువ కేసులు రాజీ చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, బ్యాంకు, రెవెన్యూ, కార్మికశాఖ అధికారులు పాల్గొన్నారు.

చలికాలం జాగ్రత్త

● న్యూమోనియా వ్యాపించే ప్రమాదం

6లో




8లో

స్వాధీనం చేసుకున్న గొలుసులను పరిశీలిస్తున్న ఎస్పీ

10 తులాల బంగారం రికవరీ

● గొలుసుల దొంగ అరెస్ట్ : ఎస్పీ మహేశ్వరరెడ్డి

వాహనపూజ చేయించి తిరిగి వస్తుండగా..



దెబ్బతిన్న మినీ వ్యాన్

● జడూరు జంక్షన్‌లో మినీ వ్యాన్‌ను ఢీకొన్న లారీ

● 18 మందికి గాయాలు

● క్షతగాత్రులది విజయనగరం జిల్లా

8లో

ఘనంగా సిక్కోలు పుస్తక మహోత్సవం

● జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆకట్టుకున్న ప్రదర్శన



పుస్తక మహోత్సవంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో మంగళవారం రాత్రి సిక్కోలు పుస్తక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. పదిరోజులపాటు ఈ మహోత్సవం కొనసాగుతుంది. తొలిరోజున.. తెలంగాణ ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం 'కాళీపట్నం రామారావు సాహిత్య వేదిక' పేరుతో సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూఢనమ్మకాల నుంచి ప్రజలను చైతన్యపరిచేలా మేకులపై భయం లేకుండా కూర్చోవడం.. గాజు పెంకులపై నిలబడటం... నక్షత్రాలు చూపించడం... వీటి వెనుక ఉన్న మర్మాలను జనవిజ్ఞానవేదిక సభ్యులు వివరించారు. ముఖ్యఅతిథులుగా పార్వతీపురం మాజీ ఎంపీ, డాక్టర్ డీవీజీ శంకరరావు, పలువురు రచయితలు, సాహితీ వేత్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సిక్కోలు టైగర్' అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే శంకర్, 'నదికీ ఒక భాష ఉంది' అనే పుస్తకాన్ని సాహితీవేత్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొంటి గిరిధర్, నల్లి ధర్మారావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



గాజు పెంకులపై మహిళలు నడుస్తూ ఇలా..



'నదికీ ఒక భాష ఉంది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ శంకరరావు, సాహితీవేత్తలు



గొండూరు గుట్ట.. స్వాహా

(ఐదో పేజీ తరువాయి)

కూడా జగనన్న కాలనీల నిర్మాణాలతో నిరుపయోగంగా మారింది.

చర్యలు తీసుకుంటాం..

లోహరిబంద పంచాయతీలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు ఎలాంటి ఫిర్యాదులు లేవు. దీనిపై రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఆక్రమణలు ఉంటే తొలగించి ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

-కె.వెంకటేష్, ఆర్డీవో, పలాస

గొండూరు గుట్టపై ఆక్రమిత ప్రాంతాన్ని చదును చేసి మొక్కలు వేసిన దృశ్యం..

కొండలను కొల్లగొట్టి..!

(ఐదో పేజీ తరువాయి)

దిగువ భాగాన కంకర, రాళ్లను తవ్వి తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పర్ లోడు రూ.6వేల వరకూ విక్రయిస్తున్నారు. మట్టిని ఇళ్లకు, సొంతానికి తరలిస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవు, కానీ వ్యాపారం కోసం నిత్యం వందలాది ట్రిప్పర్లతో కంకర తరలిస్తు రూ.కోట్లు గడిస్తున్నారు. మరోవైపు కంకర తరలించిన ప్రాంతంలో కొంతమంది వరి తదితర పంటలు పండించుకుంటున్నారు. ఆ విధంగా కొండను సైతం ఆక్రమించుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

● ఈ వ్యవహారంపై తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి వద్ద ప్రస్తావించగా.. అర్ధరాత్రి సమయంలో కంకర తరలిస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించేలా సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలకు తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



అటవీశాఖ కొండలో అక్రమ తవ్వకాలు

చలికాలం మొదలైంది. ఈ కాలంలో ఊపిరితిత్తులను ఎంత రక్షణగా ఉంచితే అంతమేలని వైద్యులు చెబుతున్నారు. జలుబు, దగ్గు వంటి రుగ్మతలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే అవి ముదిరిపోయి న్యూమోనియాకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం వ్యాధి పట్ల అవగాహన పెంచడమే కాకుండా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. బుధవారం ప్రపంచ న్యూమోనియా దినం సందర్భంగా కథనం..

చలికాలం.. జాగ్రత్త



- న్యూమోనియా వ్యాపించే ప్రమాదం
- ఊపిరి ఆడనివ్వకపోవడంతో ఉక్కిరిబిక్కిరి
- చిన్నపిల్లలు, వృద్ధులపై అధిక ప్రభావం
- అలసత్వం వహిస్తే ప్రాణాలకే ముప్పు
- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ న్యూమోనియా దినం

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి)

న్యూమోనియా అనేది బాక్టీరియా, వైరస్, శిలీంధ్రాల ఇన్‌ఫెక్షన్ల ఫలితంగా సంభవించే అంటు వ్యాధి. ఇది ఊపిరితిత్తుల్లో ద్రవం లేదా చీము ఏర్పడటానికి కారణమవుతుంది. బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ల వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. న్యూమోనియా ఫలితంగా జ్వరం, శ్లేష్మంతో దగ్గు మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులో ప్రమాదంగా ఉంటుంది.

ఎలా సంక్రమిస్తుందంటే..

న్యూమోనియా బాక్టీరియా మరియు వైరస్ వల్ల వస్తుందని గమనించాలి. తుమ్మినప్పుడు లేదా దగ్గుతున్నప్పుడు.. అప్పటికే ఈ వ్యాధి ఉన్న వ్యక్తి నుంచి ఆరోగ్యకరమైన వ్యక్తి సంక్రమించవచ్చు. పుట్టిన వెంటనే తల్లి నుంచి బిడ్డకు కూడా వ్యాపించవచ్చు. తల్లిదండ్రులు ధూమపానం చేయడం, అధిక కాలుష్యం, రద్దీగా ఉండే ప్రాంతాల్లో నివసించడం వల్ల న్యూమోనియా బారినపడే ప్రమాదాన్ని పెంచుతుంది.

● ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్కల ప్రకారం 5 సంవత్సరాలు కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో దాదాపు 14 శాతం మరణాలకు న్యూమోనియే కారణం. శ్రీకాకుళం జిల్లాలో సంభవించే శిశు మరణాల్లో 6శాతం నుంచి 7 శాతం వరకు చలికాలంలో న్యూమోనియాతో సంభవించే మరణాలే అధికమని గణాంకాలు చెబుతున్నాయి.

శిశువుల్లో న్యూమోనియా లక్షణాలు..

● జ్వరం మరియు చలి. ● చెమటలు పట్టడం. ● ఆకలి లేకపోవడం. ● చంచలమైన అనుభూతి. ● శక్తి లేకపోవడం. ● శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. ● దగ్గు. ● ఛాతీనొప్పి. ● వేగంగా శ్వాస తీసుకోకపోవడం - సాధారణం కన్నా ఎక్కువగా ఏడవడం. ● ఊపిరి పీల్చుకుంటున్నప్పుడు గుసగుసలాగే శబ్దం.

పెద్దలలో న్యూమోనియా లక్షణాలు ఇవే..

● జ్వరం ఒక్కసారిగా పెరుగుతుంది.. తగ్గదు.

● తీక్షణ దగ్గు మ్యూకస్/ చిమ్మతో వస్తుంది. కొన్నిసార్లు ఆకుపచ్చగా లేదా పసుపుగా వస్తుంది.

● శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఊపిరి బిగుసుకుపోతుంది. అలాగే ప్రత్యేకంగా శ్వాస తీసుకుంటే ఛాతీలో నొప్పి పెరుగుతుంది.

● తీవ్రంగా అలసట వస్తుంది. కొద్ది దూరంగా నడిస్తే ఆయాసం, బలహీనతగా ఉంటుంది. ముందుకు అడుగు వేయలేని స్థితి కూడా కొన్నిసార్లు ఉంటుంది.

● వణుకుతో జ్వరం లేదా గందరగోళంగా ఉండడం, స్పష్టంగా ఆలోచించలేకపోవడం కూడా కనిపిస్తుంది.

● వికారం మరియు వాంతులు వస్తాయి.

ఎప్పుడు డాక్టర్ దగ్గరకు వెళ్లాలంటే..

● శ్వాస ఇబ్బంది ఎక్కువైతే.

● ఆక్సిజన్ లెవల్స్ 90శాతం కంటే తక్కువ ఉంటే.

● జ్వరం రెండు మూడు రోజులుగా తగ్గకపోతే.

● ముఖ్యంగా ఈ లక్షణాలు చిన్నపిల్లలు, వృద్ధులు, డయాబెటిక్ /ఆస్తమా ఉన్నవారికి ఆలస్యం చేయొద్దు.

న్యూమోనియా రకాలు..

● కమ్యూనిటీ - అక్వైర్డ్ న్యుమెనియా (సీఏపీ)

● హాస్పిటల్- అక్వైర్డ్ న్యుమెనియా (హెచ్ఏపీ)

● వెంటలేటిర్- అనుబంధ న్యుమెనియా (వీఏపీ)

● హెల్త్‌కేర్-అసోసియేటెడ్ న్యుమెనియా(హెచ్‌సీఏపీ)

● అకాంక్ష న్యుమెనియా.

న్యూమోనియా సమస్యలు ఇవే..

● శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ● ఊపిరితిత్తులలో చీము ● అక్యూటీ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఏఆర్‌డీఎస్) ● అంతర్లీన పరిస్థితులు మరింత దిగజారడం ● ఉపరితిత్తుల చుట్టూ ద్రవం చేరడం ● కాలేయం, గుండె, మరియు మూత్రపిండాలు వంటి అవయవాలు ఆక్సిజన్ లేకపోవడం వల్ల దెబ్బతినే అవకాశం ఉంది.

న్యుమోనియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి..

కొన్ని సందర్భాల్లో న్యూమోనియా నిర్ధారించడం సవాలుగా ఉండవచ్చు. ఎందుకంటే దాని లక్షణాలు జులుబు వంటి ఇతర పరిస్థితులను పోలి ఉంటాయి. రోగికి వైద్య చరిత్ర పరీక్ష, శారీరక పరీక్ష, లేదా రక్తం మరియు కఫం పరీక్షలు, పల్స్ ఆక్సిమెట్రీ, సీటీ స్కాన్, ఛాతీ ఎక్స్-రే వంటి ఇమేజింగ్ పరీక్షలు, బ్రొంకోస్కోపి, ధమనుల రక్తవాయువు పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చును.

నివారణ మార్గాలు ఇవే..

న్యూమోనియా నివారించడానికి ఉత్తమ విధానాలలో మొదటిది వైరస్ మరియు బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా టీకాలు వేయించుకోవాలి. టీకాలు వేయడం వల్ల సూక్ష్మజీవులతో పోరాడేందుకు శరీరానికి రోగనిరోధక శక్తి వస్తుంది.

● ధూమపానం మానుకోవాలి. ఎందుకంటే ఇది శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను పట్టుకునే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.

● పరిశ్రమలు, వాహనాల నుంచి వచ్చే పొగకు దూరంగా ఉండాలి. ఈ పొగ ద్వారా ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉంది.

● తగినంత వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా అవసరం.

● శరీరం రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుచుకునేందుకు తాజా పండ్లు, కాయగాయలు తీసుకోవాలి. ఆకుకూరలు కూడా తినాలి.

● మద్యం సేవించడం మానుకోవాలి.

లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలి..



తరచూ జ్వరం రావడం, జలుబు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. న్యూమోనియాను మొదటి దశలో గుర్తించడం ద్వారా త్వరగా కోలుకోవచ్చును. చిన్నపిల్లల్లో గుర్తించడమే కష్టం. కాబట్టి తల్లి ఈ లక్షణాలను గుర్తించాల్సి ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం.

-డా. గొలివి మోహన్, ఎండీ, ఎంఎస్, ఛాతీ వైద్య నిపుణులు

అవగాహన పెంచుతున్నాం..



గ్రామాల్లో న్యూమెనియాపై అవగాహన పెంచుతున్నాము. చలికాలంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. దగ్గు, జలుబుతో బాధపడేవారికి కఫం పరీక్షలను చేస్తున్నాము. వృద్ధుల్లో ఎక్కువగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. చలికాలంలో మరింత అప్రమత్తంగా ఉంటే న్యూమోనియా నివారించవచ్చు.

-పి.గురునాథరావు, పీహెచ్‌సీ వైద్యులు, సైరిగాం, జలుమూరు మండలం

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.

కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం



'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు మందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

అవసరమైన పనులు గుర్తించాలి

జి.సిగడాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. మంగళవారం సంతవురిటిలో గోశాల, నీటి తొట్టెలు, ప్లాంటేషన్, సీసీ రోడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, ఈసీ పురుషోత్తమరావు పాల్గొన్నారు.

క్రీడా ఎంపికలకు స్పందన కరువు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా ఎంపికలకు స్పందన కరువైంది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ ఎంపికలకు నామమమాత్రంగా ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో క్యారమ్స్, బ్యాడ్మింటన్, కోడిరామ్మూర్తి స్టేడియంలో యోగా, చెస్, వెయిట్ లిఫ్టింగ్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల పోటీలు నిర్వహించారు.



తప్పెటగుళ్లు ప్రదర్శన ఇస్తున్న యువకులు

ప్రతిభ వెలికితీతకు పోటీలు దోహదం



యువజనోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్, చిత్రంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదం చేస్తాయని శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి అన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాలను మునసబుపేట గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీలో మంగళవారం వారు ప్రారంభించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. యువజనోత్సవ పోటీలంటే కేవలం డాన్సులు మాత్రమే అనే అపోహ అందరిలో ఉందని, ఇది సరికాదని, వివిధ పోటీల్లో పాల్గొని జిల్లా ప్రతిభ ను ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ.. జాతీయ యువజనోత్సవం సందర్భంగా యువత తమలోని ప్రతిభను ప్రదర్శించి కీర్తి పొందాలన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ.. యువత తమ ప్రతిభను ప్రదర్శించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. సెట్‌శ్రీ సీఈవో వీవీ అప్పలనాయుడు మాట్లాడుతూ... జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతీ యువకులు జానపద గీతాలు, జానపద నృత్యాలు, తప్పెటగుళ్ల తదితర అంశాలను ప్రదర్శించారు. వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు, పర్యాటక అధికారి నారాయణరావు, మై భారత్ శాఖ డీడీ ఉజ్వల్, గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సంయుక్త, ప్రిన్సిపాల్ కేవీవీ సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో ఆర్.శ్రీనివాస పాత్రో తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

గార, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో మండలంలో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలుకు గాను 15 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏవో దుంపల పద్మావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంపోలు, అంపోలు (లింగాలవలస), బూరవెల్లి, కళింగపట్నం (దువ్వుపేట), శ్రీకూర్మం (ఎస్.మత్స్యలేశం), తూలుగు (కొయ్యానపేట), వాడాడ, వమరవెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

సోంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన బెంకిలికి చెందిన లొట్ల నిఖిల్ కుటుంబ సభ్యులకు వైసీపీ తరఫున నేతలు రూ.2 లక్షల చెక్కును మంగళవారం అందించారు. కార్యక్రమం లో జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాసు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు.

డా.బిందు మాధురి బదిలీ

శ్రీకాకుళం రిమ్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్యూటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.బిందుమాధురిని నెల్లూరు మెడికల్ కాలేజీకి బదిలీ చేస్తూ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె వ్యక్తిగత అభ్యర్థన మేరకు ఈ బదిలీ జరగడంతో టీఏ, డీఏ వంటి భత్యాలు లభించవని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

విద్యార్థులతో వనసమారాధన

సోంపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ అటవీశాఖాధికారి మురళీకృష్ణం నాయుడు సూచనల మేరకు కార్తీక వనమాసారధన మూల గోవిందపురం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి మంగళ వారం చేపట్టారు. సుంకిడి బీటు, మందస సెక్షన్ ఆధ్వర్యంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. హెచ్ఎం మార్కండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ: ఒకరి మృతి

శ్రీకాకుళం రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలో ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గార మండలం వమరవల్లికి చెందిన ఆర్మీ ఉద్యోగి చింతపాన ధనంజయ రెడ్డి(26) బైక్‌పై శ్రీకాకుళం బయల్దేరాడు. గూడెంకి చెందిన తాపీమేస్త్రి మట్ట వెంకటరావు తన బైక్‌పై సింగుపురం నుంచి నరసన్నపేటకు వెళ్తుండగా ఈ రెండు బైక్‌లు మంగళవారం రాత్రి భైరి జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో ఢీకొన్నాయి. ధనంజయ రెడ్డి తన బైక్‌తో వేగంగా వెళ్లి వెంకటరావు బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. బైక్ ఢీకొనడంతో వెంకటరావు(50) దూరంగా పడి అక్కడికక్కడే మతిచెందాడు. మృతుడికి భార్య గన్నెమ్మ, బీటెక్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రూరల్ పోలీసులు మృత దేహాన్ని రిమ్స్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణ బకాయిలపై దృష్టి

(ఐదో పేజీ తరువాయి)

ఉండడంపై ఆరా తీశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కోర్టు కేసుల పెండింగ్‌పై సమీక్షించారు. అన్నదాత సుఖీభవ, రెగ్యులరైజేషన్, ఈ-పంట నమోదు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు జయదేవి, పద్మావతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ధనుష్



ధనుష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి ఎచ్చెర్ల ధనుష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ధనుష్ ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి వెండి పతకం సాధించాడన్నారు. బుధవారం నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గరుడవాడలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటు న్నాడని తెలిపారు. 2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ బంగారు పతకం సాధిం చాడని పేర్కొన్నారు. రాష్ట్రంలోని గురుకులాల నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఒకే ఒక విద్యార్థి ధనుష్ కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో బంగారు పతకం..



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

ఇచ్ఛాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జె.అను, ఎస్.హేమలత పాల్గొని బంగారు పతకం సాధించారని హెచ్ఎం జి.హేమకుమారి తెలి పారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థి నులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. కడప జిల్లా బద్వేల్‌లో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని సత్తా చాటారన్నారు.

కొమ్ముపురుగు నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి



రైతులకు వివరిస్తున్న దృశ్యం

రణస్థలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిలో కొమ్ము పురుగు నియంత్రణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్త ఎం.ముత్యాల నాయుడు అన్నారు. 'కొబ్బరికి ఏమైంది' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం మెంటాడ గ్రామం లో కొబ్బరి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. 5 నుంచి 6 సంవత్స రాల వయసున్న కొబ్బరి తోటల్లో నల్లముట్టె పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. చిన్న వయ సున్న తోటల్లో లీటరు నీటికి 10 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ ముం దు కలిపి పిచికారీ చేయడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. కొబ్బరి, అరటిలో తెగుళ్ల నివారణ చర్యలపై శాస్త్రవేత్త వి.గోవర్ధన్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి టి.అమరేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించేలా కృషి చేయాలి



ఎంపీ కలిశెట్టికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

రణస్థలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టెట్ నుంచి ఇన్ సర్వీస్ టీచర్లకి మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం రణస్థలంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. టెట్ నుంచి 2011 కంటే ముందు చేరిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పార్లమెంట్‌లో చట్ట సవరణకు కృషి చేయాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు, పీఆర్‌టీయూ స్టేట్ కౌన్సిలర్ కెల్ల రమణ, మహిళా కార్యదర్శి కె.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్ భరత్



తేజ్ భరత్

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం మెప్మా డైరెక్టర్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న విశ్వనాథన్‌ను గత నెల తొమ్మిదో తేదీన ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి తరచూ వెళుతున్నా పెట్టుబడుల సదస్సు కారణంగా వీఎంఆర్‌డీఏపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు.

ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించే బాధ్యతను ప్రభుత్వం వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. విశ్వనాథన్ వెళ్లిన తరువాత ఆ పనుల్లో పెద్దగా పురోగతి లేకుండా పోయింది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో పూర్తిస్థాయి అధికారిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు జరగనున్న నేపథ్యంలో తేజ్ భరత్ వెంటనే విధుల్లో చేరే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం వచ్చేసరికి ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకుంటారని సమాచారం.

భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం

అరసవల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఆలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. తొలుత ఉచిత అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించి అక్కడి భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్‌తో ఆలయ అభివృద్ధిపై చర్చించారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఇంజినీరింగ్ సిబ్బంది అవసరమని ఈవో తెలుపగా తక్షణ చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రథసప్తమి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. రూ.4కోట్లతో త్వరలో పుష్కరిణి అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

రైల్వే పోలీసుల ముమ్మర తనిఖీ



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీ ఎర్రకోట వద్ద సోమవారం జరిగిన బాంబు పేలుళ్ల ఘటనతో దేశ వ్యాప్తంగా భద్రతా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ పరిధిలోని ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లు, పార్కింగ్ ప్రాంతంలో నిలిపిన బైక్‌లు, ఆటోలు, కార్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్పీఎఫ్ ఓసీ ఎస్.కాంతారావు, ఎస్ఐ నాయక్, జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు పర్యవేక్షణలో భోగీలు, వెయిటింగ్ హాళ్లు, ప్లాట్ ఫారాలు, టిక్కెట్ కౌంటర్ల పరిసరాలను తనిఖీ చేశారు.

సీఎస్ఈ విభాగాధిపతిగా దిలీప్

ఎచ్చెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో సీఎస్ఈ విభాగాధిపతిగా కె.దిలీప్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

కరాటే విజేత కిరణ్‌కు సత్కారం

సోంపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ లో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో పతకాలు పొందిన పొట్టి కిరణ్‌కుమార్‌కు మంగళవారం స్వగ్రామం ఇసుకల పాలెంలో పౌర సన్మానం చేశారు. మూడు బంగారు, రెండు వెండి పతకాలను కైవసం చేసుకుని అండమాన్ నుంచి స్వగ్రామానికి రావడంతో గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతినిధులు సూరాడ చంద్ర మోహన్, బైపల్లి రామారావు, వాసుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై నిర్లక్ష్యం తగదు

కవిటి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గొర్లెపాడు పంచాయతీలో జరిగిన ఆక్రమణపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఐ నేతలు ఎస్.నారాయణస్వామి, పి.ఆరేలమ్మ అన్నారు. మంగళవారం రైతులతో కలిసి చర్చించారు. ఈ పంచాయితీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దానిపై కవిటి మండల రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తూ వాయిదాలు వేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఐ.లోకనాథం, వల్లభరావు, సుదర్శన్, పద్మనాభం పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

● ఎమ్మెల్యే రవికుమార్



రేషన్ సరుకులను అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస/బూర్జ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాల వలస మండలం శ్రీనివాసాచార్యులపేట, బూర్జ మండలం ఉప్పినివలస గ్రామాల్లో మొంథా తుఫాన్‌తో నష్టపోయిన చేనేత కార్మికులకు మంగళవారం ప్రభుత్వం మంజూరు చేసిన 50 కేజీల బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు పనిలేక నష్టపోయిన మత్స్యకారు లకు నిత్యావసర సరుకులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేత కార్మికులు తుఫాన్ వల్ల పనులు కోల్పోయిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసు కువెళ్లగా వారికి కూడా సరుకులు మంజూరు చేసి ఆదుకునేందుకు ముందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ రావు, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, గొండు రమణ, ఎంపిటిసి అన్నెపు భాస్కర రావు, టీడీపీ నేత నూకరాజు, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో రోణంకి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి అభినందనీయం

● ఎమ్మెల్యే బెందాళం అశోక్



బైక్ రైడర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే బి.అశోక్

కవిటి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షించాలని, ప్లాస్టిక్‌ను విడనాడాలని కోరుతూ చేపట్టిన గ్రేట్ ఆంధ్రా రైడ్ యువకులు ప్రచారం చేస్తుండడం అభినందనీయమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం పట్టణానికి చెందిన శివకుమార్, ఉపేంద్ర, లక్ష్మీపతి బైక్‌లపై కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన ప్రచారంలో భాగంగా వీరు మంగళవారం కవిటి మండలం రామయ్యపుట్టుగ వచ్చి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. మంచి కార్యక్రమం చేపడుతున్నారని కొనియాడారు. బైక్‌రైడర్ల తిరుగు ప్రయాణానికి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.కృష్ణారావు, బి.రమేష్, ఎస్వీరమణ, బాసుదేవ్‌ప్రదాన్, ఎస్.సహదేవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)



జి.సిగడాం : సంతవురిటిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

స్వయం ఉపాధి కల్పనకు రుణాల రూపంలో ప్రభుత్వం ప్రోత్సాహన్నిస్తోంది. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంతవురిటిలో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా సుమారు 500 మందికి ప్రత్యక్షంగా, వెయ్యి మంది రైతులకు పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు.

భారీ పెట్టుబడులు ఆకర్షించేలా..

విశాఖపట్నంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 'విశాఖ సీఐఐ సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన 8 మంది స్పీకర్‌లు ఈ సదస్సులో పాల్గొంటారు. వివిధ దేశాల ప్రతినిధులు, పలు ప్రముఖ కంపెనీల సీఈవోలు, ఆర్థిక నిపుణులు, కేంద్ర మంత్రులు పాల్గొని వివిధ దేశాల వాణిజ్య అవకాశాలపై చర్చిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 410 ఒప్పందాలు కుదుర్చుకోనుంది. వీటి ద్వారా రాష్ట్రానికి సుమారు రూ. 9.76 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నా'మని మంత్రి తెలిపారు. కార్యక్రమాల్లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయిప్రత్యూష, డీపీవో సౌజన్యభారతి, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, కూటమి నేతలు లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, చౌదరి బాబ్జీ, రౌతు శ్రీను, పిసిని జగన్నాథంనాయుడు, లంక ప్రభ, సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, సొకేటి నాగరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్న బీఎం, సిబ్బంది

పాతశ్రీకాకుళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలో కళింగరోడ్‌లో ఉన్న బ్యాంకులో మంగళవారం నిర్వహించారు. ఖాతాదారులకు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ.. 107 ఏళ్లుగా యూనియన్ బ్యాంకుకు ఖాతాదారులు అత్యంత విశ్వాసం చూపిస్తూ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తున్నారన్నారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

అరసవల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్, శ్రీకాకుళం జిల్లా శాఖ సేవలు అభినందనీయమని రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ వైడి రామారావు అన్నారు. మంగళవారం జిల్లా శాఖను సంద ర్శించి, జిల్లా రెడ్‌క్రాస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాలు చేపడుతున్న ప్రాంతాల్లో పర్యటించి, సంబంధిత ఇన్‌చార్జిలతో మాట్లాడి ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, పి.చైతన్యకుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టాలి

జి.సిగడాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ జమ, ఖర్చులపై గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు కోరారు. పెంట పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గ్రామానికి చెందిన గార శివప్రసాద్, డోల సంతోష్, మక్క రామగోవింద, డోల భాను, డోల వెంకటేష్ తదితరులు కలెక్టర్ నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీపీవో ఆదేశాల మేరకు మంగళవారం పెంట గ్రామ సచివాలయంలో డీఎల్‌పీవో గోపిబాల విచారణ చేపట్టారు. సర్పంచ్ పున్నాన సోనియా, కార్యదర్శి ఎ.దుర్గారావు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో మోక్షం పొందాలి



పాదయాత్ర చేస్తున్న స్వామీజీ

ఇచ్ఛాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా భక్తి మార్గంలో పయనించి మోక్షం పొందాలని, ఇదే సంకల్పంతో యాత్ర చేపడుతున్నట్లు పరమపూజ్య తపస్వి బాబాజీ శ్రీకల్యాణ దాస్ మహారాజ్‌జీ శిష్యుడైన రాఘవ నంద మహారాజ్ అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం చేరుకున్న స్వామికి వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. స్వామీజీ మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్‌లో ఉత్తరాఖండ్ రాష్ట్రం గంగోత్రిలో పాదయాత్ర ప్రారంభించానని, రామేశ్వరం వద్ద ముగిస్తానని తెలిపారు.

వాహనపూజ చేయించి తిరిగి వస్తుండగా..

- మినీ వ్యాన్‌ను ఢీకొన్న లారీ
- 18 మందికి గాయాలు.. వీరిలో నలుగురు చిన్నారులు
- అందరూ ఒకే కుటుంబ సభ్యులు
- క్షతగాత్రులది విజయనగరం జిల్లా సిరిపురం గ్రామం
- పోలాకి మండలం జడూరు జంక్షన్‌లో ఘటన

నరసన్నపేట/పోలాకి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనానికి (మినీవ్యాన్) పూజలు చేసేందుకు ఇంటి నుంచి మంగళవారం ఉదయం బయలుదేరారు. దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా.. పోలాకి మండలం జడూరు జంక్షన్‌లో వెనుక నుంచి వచ్చిన ఓ లారీ ఓవర్‌టాక్ చేస్తూ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ వ్యాన్ అదుపు తప్పి.. డివైడర్ మీదుగా అవతల రోడ్డుపైకి వెళ్లింది. ఈ సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు కొత్తగా వాహనం (మినీ వ్యాన్) కొనుగోలు చేశారు. వాహనానికి పూజ చేయించేందుకు 19 మందితో కలిసి మంగళవారం బయలుదేరారు. తొలుత కోటబొమ్మాళి మండలంలో గల కొత్తమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అక్కడి నుంచి టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకుని తిరుగి పయనమయ్యారు. తామరాపల్లి సమీపాన జడూరు జంక్షన్‌కు చేరుకునే సమయంలో ఓ లారీ వెనుక నుంచి వస్తూ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 18 మంది గాయపడగా.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. టి.సూరిబాబుకి కాలు విరిగిపోగా, అతడి భార్య విజయ్ నడుముకు గాయాలయ్యాయి. టి.జయద్రిశ్రీ, టి.ప్రణీత, కె.దాలినాయుడు, కె.హరిక, కలివరపు అప్పారావు, కలివరపు సంధ్య, దువ్వరపు అప్పన్న, డి.ఈశ్వరరావు, సాయి, శ్యామలరావు, లక్ష్మీకాంతమ్మ, లక్ష్మీతులసీతో పాటు మరో నలుగురు చిన్నారులు గాయపడ్డారు. స్థానికుల సాయంతో 108వాహనం, హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలాకి ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.





ఘటనా స్థలంలో క్షతగాత్రులు

10 తులాల బంగారం రికవరీ

- గొలుసుల దొంగ అరెస్ట్
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఐదు బంగారం గొలుసులు చోరీకి పాల్పడిన వ్యక్తిని కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేసి ఆ వ్యక్తి నుంచి 10 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాల యంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కేంద్రపర జిల్లాకు చెందిన మహేశ్వర్ దలై ఈ ఏడాది జనవరి, అక్టోబరు, నవంబరు నెలల్లో జిల్లాలో కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ దోపిడీలకు పాల్పడుతుండేవాడు. అతడిని కోసంగిపురం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా కాశీబుగ్గ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. కాశీబుగ్గ, కవిటి, మందస తదితర ప్రాంతాల్లో ఐదుగురు మహిళల నుంచి బంగారు గొలుసులు చోరీకి పాల్పడినట్టు నేరం అంగీకరించాడు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆలయాల వద్ద పటిష్ఠ భద్రత

ఇటీవల కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు మృతి చెందిన నేపథ్యంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయాల్లో గట్టి భద్రతా చర్యలు ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో సుమారు 11 వేల దేవాలయాలను గుర్తించామని, వాటిని ఏ, బీ, సీ, డీ కేటగిరులుగా విభజించి భద్రతా చర్యలు తీసు కున్నామన్నారు. ప్రభుత్వ ఆధీనంలో లేని ప్రైవేట్ దేవాలయాల్లో కమిటీ సభ్యులే బాధ్యత వహించాలన్నారు. కార్తీకమాసం పురస్కరించుకొని మరీ రద్దీ ఎక్కువన్న దేవాలయాల్లో ముందస్తుగా పోలీసు శాఖకు సమాచారం అందించాలన్నారు. నాగావళి నదిలో ఇటీవల స్నానానికి దిగిన వారు ప్రమాదానికి గురవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, త్వరలో హెచ్చరిక బోర్డులను నదీతీర ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో ఉన్న డేఅండ్‌నైట్ కూడలి, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న వంతెనలపై సీసీ కెమెరాలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జిల్లాలో ప్రత్యేక నిఘా

ఢిల్లీలో పేలుడి ఘటన నేపథ్యంలో జిల్లాలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. ఒడిశాను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, నాకాబందీ ముమ్మరం చేశామన్నారు. లాడ్జీలు, హోటళ్లను తమ సిబ్బంది తనిఖీలు చేస్తూ అనుమానితులు తారసపడితే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారన్నారు. నిరంతరం వాహనతనిఖీలు చేస్తున్నామన్నారు.

ఆజాద్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో..

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్, మైనార్టీ అధికారి మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబటి దాలినాయుడు, చాంద్ భాషా, సైదుల్లా ఖాన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి రిజిస్ట్రార్ బి.అడ్డయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.అనూరాధ, రాజశేఖరరావు, కె.స్వప్నవాహిని, ఎస్‌వో కె.స్వామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కవిటి: కవిటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జె.పాపారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్ఎన్ పేట: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కోవిలాం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. హెచ్ఎం ఎం.గజపతిరావు, ఉపాధ్యాయులు పి.వెంకటరావు, విశ్వేశ్వరరావు, డి.వెంకటలక్ష్మి, పి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● జలుమూరు: చల్లవానిపేటలో మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ, నాయకులు రావాడ సుదర్శనరావు, డి.అప్పలస్వామి, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, బేరి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఆరోగ్యం: ఎమ్మెల్యే ఎంజీఆర్



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పాతపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శరీర ఆరోగ్య పరిరక్షణ సాధనాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. స్థానిక గిరిజన సామాజిక భవన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన 69వ ఏపీ అంతర్రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2025 పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడాపతాకాలను ఆవిష్కరించి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలోని 11 జిల్లాలకు చెందిన సుమారు 500మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు రాష్ట్రబాధ్యులు ఎన్ని శేఖర్‌బాబు తెలిపారు. క్రీడకారులకు అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు వచ్చే నెలలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ.. గెలుపు ఓటమిలను సమానంగా తీసుకొనే క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ సభ్యులు పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, వ్యాయామోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.తవిటయ్య కార్యదర్శి ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కోటబొమ్మాళి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం పానిపట్‌లో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న సబ్ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోటబొమ్మాళి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చీరు చంద్రలేఖ, పాత్రుని గీతిక ఎంపికైనట్టు ఎంఈవో డి.గోవిందరావు మంగళవారం తెలిపారు. వీరి ఎంపికపై వ్యాయామ ఉపాధ్యాయులు వాసుదేవరావు, ఎస్.గణేష్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బోయిన వెంకటరమణ అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు

కడప జిల్లా పులివెందులలో ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు జరిగిన 35వ రాష్ట్రస్థాయి బాల, బాలికల సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించింది. వీరికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందనలు తెలిపారు. ఈ విజయంలో కోటబొమ్మాళి జడ్పీ పాఠశాల విద్యార్థులు భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని ఎంఈవో తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన జిల్లా బాల, బాలికల జట్లు

26 మంది బైండోవర్

వజ్రపుకొత్తూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వీరికి సరఫరా చేస్తున్న మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని పలాస ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. ఇందులో భాగంగా పాతకేసుల్లో పట్టుబడిన 26 మందిని తహసీల్దార్ సీతారామయ్య వద్ద మంగళవారం బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఇది ఏడాదిపాటు అమలు ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే రూ.50 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అక్రమ మద్యం, సారా సరఫరాపై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫోన్ చేసి తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఈవో-2 సీహెచ్ సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.10వేలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా స్కూల్ విద్యార్థులకు రూ.20, కాలేజీ విద్యార్థులకు రూ.60 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మధ్యాహ్న భోజన కార్మికులు పి.భూదేవి, బి.శశిరేఖ, వై.మణమ్మ, కె.మహాలక్ష్మి, వసంత, గౌరమ్మ, జ్యోతి ఉన్నారు.

20 నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

హరిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలబాలికల టెన్నికాయిట్ పోటీలు మందస మండలం సొండిపూడి హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర పీఈటీ సంఘం అధ్యక్షుడు తవిటయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు పీఈటీ ఎస్.విజయ్‌లు మాట్లాడుతూ.. నవంబరు 20, 21తేదీల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో అన్ని జిల్లాలల క్రీడాకారులు పాల్గొంటారన్నారు. భోజన, వసతిపై సర్పంచ్, ఎంపీటీసీలు, హెచ్ఎంతో మాట్లాడారు. ఈ పోటీలను తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందర్ సాల్మన్, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, వై.తులసీదాస్, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



మృతిచెందిన రామస్వామి

బూర్జ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చీడివలస గ్రామానికి చెందిన మజ్జి రామస్వామి (75) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. రామస్వామి భార్య ఏడాది కిందట మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. తరచూ చనిపోవాలని ఉందంటూ కుటుంబ సభ్యుల వద్ద చెబుతుండేవాడు. దీనికి తోడు మతిస్థిమితం కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గుర్తించిన కుమారుడు రమణ వైద్యసేవల నిమిత్తం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రామస్వామి మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణాపార్కు సమీపంలోని మహిళా మండలివీధి వద్ద నాగావళి నదిలోకి ఆదివారం తన స్నేహితులతో స్నానానికి వెళ్లి గల్లంతైన వమ్మి ఉదయ్(20) మృతదేహం మంగళవారం లభ్యమైంది. గత రెండు రోజులుగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నాగావళి నదీ తీరమంతా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం తండ్రి, బంధువులు ఉదయ్ ఆచూకీ కోసం నాగావళి నదీతీరంలోని వెతకగా కలెక్టర్ బంగ్లా సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నదీతీరంలో మృతదేహం ఉదయ్ తండ్రి లక్ష్మీనారాయణకు కనిపించింది. ఈ మేరకు అతను వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ హరికృష్ణ ఘటనా స్థలాన్ని చేరుకొని ఉదయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజాభివృద్ధికి యువత పాటుపడాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యువజన సంఘాలు గ్రామాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధి పాటుపడాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బొడ్డపాడు గ్రామంలో జైభీమ్ యువజన సంఘం 31వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. యువజన సంఘాలు గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని, యువకులు గ్రామంలో ప్రజలకు చైతన్యవంతులను చేయడంతో పాటు సమాజ హితమైన సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతకు ముందుగా యువజన సంఘ పతాకావిష్కరణ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. యువజన సంఘ సభ్యుడు కిక్కర ఢిల్లీరావు అధ్య క్షత జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, కుత్తుమ లక్ష్మణకుమార్, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువజన సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సాయంత్రం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ● పలాస: ఉదయపురం గొడగలవీధిలో అభయాంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పర్లాం మాకివలసలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, చల్లవానిపేట, అల్లాడ సొసైటీ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

శివస్వాముల ప్రత్యేక పూజ



పూజలు చేస్తున్న శివస్వాములు

టెక్కలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని మంగళవారం స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగానికి రుద్రాభిషేకం, విభూది అభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున శివస్వాములు ఈ పూజల్లో పాల్గొని భజనలు చేశారు.

రాయితీపై విత్తనాలు

టెక్కలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలు సాగుచేసేందుకు గాను రాగులు, పెసర, మినుము, నువ్వులు, కట్టెజనుము వంటి విత్తనాలు రైతు సేవా కేంద్రాలు ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బగాది శేషగిరి చేతులు మీదుగా రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడి రాము, లవకుమార్, ప్రసాద్‌రెడ్డి, పురుషోత్తం, మాజీ ఎంపీపీ సుందరమ్మ, ఏవో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● నందిగాం: రబీ సాగుకు సంబంధించి అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో పెయ్యల శ్రీకాంత్‌వర్మ తెలిపారు. పెసర, మినుము, తెట్టంగి రకాలు రైతుసేవా కేంద్రాల్లో ఉన్నాయని, రాయితీపై అందించడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పోలాకి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై యువతీ, యువకులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ లీలావతి, క్యాష్‌యిర్ షన్ముఖ ప్రభాపవన్ తెలిపారు. మంగళవారం పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై ఎస్‌బీఐ ఉగ్యోగులు అవగాహన కల్పించారు. ఈ విషయాలపై రాజమండ్రి కళాజాత బృందం గ్రామాల్లో బుర్రకథ, గేయాలు వీధినాటకం, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పద్మావతి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.లక్ష్మి, ఎస్‌బీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

'పీఎంశ్రీ' పాఠశాల పరిశీలన

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పరిశీలకు పుల్లట రమేష్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో ఆధునిక ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు నిర్మాణాలను పరిశీలించారు. అలాగే విద్యార్థుల్లో ఆసక్తి కలిగించే విధంగా బోధన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష ఎంఐఎస్ కో ఆర్డినేటర్ దివాకర్, ఎంఈవో పి.దాలినాయుడు, హెచ్ఎం పివెంకట్రావు, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు పూర్తిచేయాలి

ఎల్ఎన్ పేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో జరుగుతున్న సర్వేలన్నీ సత్వరమే పూర్తిచేయాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం బూత్ లెవెల్ (బీఎల్‌వో)లతో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో జరుగుతున్న జీఎస్‌డబ్ల్యూ, హౌసింగ్, కౌశలం (వర్క్ ఫ్రమ్‌హోమ్) సర్వేలన్నింటిని సకాలంలో పూర్తిచేయాలన్నారు. సర్వేలు పూర్తిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవన్నారు.

చెక్కులు అందజేత

మందస, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన మందస మండలం బెల్లుపటియా గ్రామానికి చెందిన దువ్వు రాజేశ్వరి, మందస గ్రామానికి చెందిన బోర బృందావతి కుటుంబాలకు మంగళవారం వైసీపీ తరఫున రూ.2లక్షలు చొప్పున్న ఆ పార్టీ నాయ కులు అందజేశారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

పాతపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో పీవో స్వప్నిల్ పవర్ జగన్నాథను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి మంగళవారం కలుసుకున్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పీవోకి వివరించినట్టు చెప్పారు.

పర్యావరణంపై అవగాహన

టెక్కలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులచే కార్తీక వన సమరాధన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి విద్యార్థి ఒక చెట్టును నాటి హరిత వాతావరణం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో మారుతీప్రసాద్ ఉన్నారు.

సమావేశం బహిష్కరణ

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత అధికారులు ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను భాగస్వామ్యం చేయడంలేదని, అలాగే తమ ప్రమేయం లేకుండా పంపిణీలు చేస్తున్నారంటూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ.. సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇటీవల స్మార్ట్‌కార్డుల పంపిణీలో తమకు సమాచారం లేదని, అలాగే నరసన్నపేట పట్టణంలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీపీ ఆరంగి మురళి సభలో ప్రస్తవించారు. దీంతో సభ్యులంతా మద్దతూ తెలుపుతూ బహిష్కరించారు. ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్, తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

శిక్షణతో ఉపాధి అవకాశాలు

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యకోర్సులు చదువుతున్న విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్ ఎంతోగా ఉపయోగపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృతివిద్యకోర్సు విద్యార్థులకు అందించే క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పరిశీలకులకు నిరంజన్ రావు, నాగకుమారి, శాంతారావు తదితరులు పాల్గొన్నారు. వచ్చేనెల 31వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

జలుమూరు, (సారవకోట), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అంగన్‌వాడీ కార్యకర్తలకు సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ వంశీప్రియ హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బందితో సమీక్షించారు. అంగనవాడీ కార్యకర్త, ఆయాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆశించిన ఫలితాలు రాకపోతే సిబ్బంది నిర్లక్ష్యంగానే పరిగణించాల్సి వస్తుందన్నారు. పలువురు అంగనవాడీ సూపర్‌వైజర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మై భారత్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా నరేంద్ర



నరేంద్ర చక్రవర్తిని సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖకు సంబంధించి జిల్లా నుంచి మై భారత్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా బీజేపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి నియమితులయ్యారు. దీంతో నరేంద్ర చక్రవర్తిని మంగళవారం డాక్టర్ చిన్నంనాయుడు, పోలాకి వాసుదేవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు పోలాకి చంద్రశేఖర్, బలరాం, కిరణ్మయి తదితరులు ప్రత్యేకంగా సన్మానించారు.